క్లుప్తంగా

కిన్నెరసానిని సందర్శించిన ఐఏఎస్ అధికారి



పింకేశ్‌కుమార్ దంపతులతో అధికారులు

పాల్వంచరూరల్: మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని బుధవారం మహబూబాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పింకేశ్‌కుమార్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా డీర్ పార్క్‌లోని దుప్పులు, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్‌లో బోటింగ్ చేశారు. ఆర్‌ఐ హచ్యా, ఏటీడీఓ చంద్రమోహన్, బీట్ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

కళలను విస్తృత పర్చాలి



శ్రీపాద సత్యనారాయణను సన్మానిస్తున్న కళాకారులు

పాల్వంచ: కళాకారులను ప్రజలు ఆదరించాలని, కళాకారులు తమ కళలను విస్తృత పరిచేందుకు కృషి చేయాలని పాకాలపాటి కృష్ణయ్య, సాంస్కృతిక కళాపీఠం వ్యవస్థాపకులు రోశయ్య చౌదరి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక కళాభవన్‌లో బుధవారం పలువురు కళాకారులను, తెలంగాణ ఉద్యమకారుడు శ్రీపాద సత్యనారాయణను సన్మానించారు. రోశయ్య చౌదరి మాట్లాడుతూ.. కళాకారులు ఐకమత్యంతో మరిన్ని మంచి కార్యక్రమాలు రూపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాతూరి రాంమోహన్‌రెడ్డి, ఎస్‌కె.మీరా, ఎస్‌కె.రసూల్, ఎస్‌కె.ఖాసీం, గాంధీ, వెంకన్న, గోవర్దన్, భాషా, లక్ష్మణ్, మోహన్, కాల్వ విజయ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

సింగరేణి(కొత్తగూడెం): ఆటోరంగ కార్మికులకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి వారి జీవితాలకు భరోసా కల్పించాలని, ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. బుధవారం గణేష్‌టెంపుల్ అడ్డాలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి మున్సిపల కమీషనర్ రఘుకు వినతిపత్రం అందజేశారు. జమలయ్య మాట్లాడుతూ.. స్వయం ఉపాధి కల్పించుకుంటూ జీవిస్తున్న ఆటో డ్రైవర్లకు జీవిత భద్రత లేదని, 57 సంవత్సరాలు నిండిన ఆటో డ్రైవర్‌కు పింఛన్ ఇప్పించాలని కోరారు.

రేపు 'చలో ప్రగతిభవన్'



మాట్లాడుతున్న రాజేష్‌నాయక్

కొత్తగూడెంటౌన్: జూన్ 30న జరగనున్న చలో ప్రగతి భవన్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ అన్నారు. బుధవారం బస్టాండ్ సెంటర్‌లో ఎస్టీ సంఘాల ఐక్య వేదిక సమావేశంలో వారు మాట్లాడారు. ఏజెన్సీ చట్టాలకు తూటు పొడుస్తూ బంధుప్రీతిని చాటుకుంటున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు హెల్త్ డైరెక్టరా లేక బీఆర్‌ఎస్ నాయకులా అని ప్రశ్నించారు. నోటిఫికేషన్ లేకుండా ఉద్యోగాలు ఇప్పిస్తూ రాజకీయంగా తనవైపు తిప్పుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలు ప్రచారం పక్కన పెట్టి నూతనంగా తన పేరుపై ట్రస్ట్ ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, ప్రభుత్వ వైద్యులకు అవమానం అన్నారు. గడల అవినీతిపై ప్రగతిభవన్ ముట్టడిస్తున్నట్లు చెప్పారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పాల్వంచరూరల్: దంతలబోరు ఎస్సీకాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణం చేయనున్న గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి సర్పంచ్ గద్దల రమేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యదర్శి రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ బర్ల శంకర్, ఉపసర్పంచ్ బర్ల వెంకటనర్సమ్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్టేషన్‌బస్తీలో 'క్రమబద్ధీకరణ' కుస్తీ

- ఇంకా తొలగని ఆటంకాలు
- రైల్వే, సింగరేణి, రెవెన్యూ శాఖల మధ్య నలుగుతున్న ప్రజలు
- 537 సర్వే నంబర్‌లో ఓకే.. 538పై వీడని ప్రతిష్టంభన



స్టేషన్‌బస్తీ వ్యూ

ఇల్లెందు: ఇల్లెందు వాసులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు తుదిదశకు చేరింది. జీఓ 76, 56, 58 ప్రకారం ఇప్పటి వరకు సుమారు 3 వేల గృహ స్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలు అందజేశారు. అయితే, పట్టణంలో అంతర్భాగమైన స్టేషన్‌బస్తీలో ఆ ప్రక్రియపై గందరగోళం నెలకొంది. ఇక్కడి ప్రజలు పట్టాలు అందుతాయని నాలుగు దఫాలుగా దరఖాస్తు చేసుకున్నా సింగరేణి, రైల్వే, రెవెన్యూ శాఖల కొర్రీలతో అంతు తేలడం లేదు. క్రమబద్ధీకరణ దరఖాస్తు గడువు చివరి దశకు చేరడంతో వీరిలో ఆందోళన పెరుగుతోంది.

సర్వే నంబర్ 537 ఓకే.. 538పై చిక్కుముడి

స్టేషన్‌బస్తీలో 19, 20, 21వార్డులు ఉండగా.. 600 వరకు గృహాలున్నాయి. ఈ గృహాలన్నీ అటు సింగరేణి, ఇటు రైల్వే పరిధిలో ఉండటంతో ఇటీవల 30 ఎకరాల్లో ఉన్న 537 సర్వే నంబర్ భూమిని సింగరేణి అధికారులు రెవెన్యూ శాఖకు అప్పగించారు. దీంతో కథ సుఖాంతమైందని అంతా భావించారు. కానీ ఈ మూడు వార్డుల్లో 537 సర్వే నెంబర్ పరిధిలో కొంతే ఉంది. మిగతా భూమి 538 సర్వే నంబర్‌లో ఉండగా, దీని పరిధిలోని 150 వరకు గృహ యజమానులకు నష్టం జరిగే పరిస్థితి ఉండనుంది. సింగరేణి ఆధీనంలోనే ఉన్న ఈ భూమి కొంత సీఎస్పీబస్తీ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండడంతో చిక్కుముడి వీడడం లేదు.

ఆటంకంగా రైల్వేశాఖ

ఇదే స్టేషన్ బస్తీ మీదుగా రైల్వే లైన్ వెళ్తోంది. రైల్వే లైన్‌కు 130 మీటర్ల దూరం వరకు రైల్వే స్థలంగా నిర్ధారించారు. తాజాగా రెవెన్యూశాఖ జరిపిన సర్వేలో హద్దులు దాటి మరో వంద వరకు ఇళ్లు రైల్వే పరిధిలో ఉన్నట్లు తేల్చారు. ఫలితంగా వీరందరూ క్రమబద్ధీకరణకు అవకాశం కోల్పోతుండటంతో ఆందోళన తీవ్రమైంది.

దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించటంతో అవకాశమున్న ఉన్న వారు అర్జీలు ఇస్తుండగా.. మిగతా వారు రైల్వేశాఖ, సింగరేణి అధికారులను సంప్రదిస్తున్నారు. సింగరేణి పరిధిలో ఉన్న వారికి ఏనాటికైనా పట్టాలు వస్తాయని ఆశగా ఉండగా... రైల్వే పరిధిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారి విషయంలో ఎటూ తేలడం లేదు.



స్టేషన్ బస్తీని చీలుస్తూ వెళ్తున్న రైల్వేలైన్

మాకు అన్యాయం చేయొద్దు..



రైల్వేలైన్‌కు 130 మీటర్ల దూరం తర్వాత ఉన్న మా భూమి రైల్వేశాఖ పరిధిలో లేదని ఆ శాఖ, రైల్వే పరిధిలోనే ఉందని రెవెన్యూ శాఖ అధికారులు చెబుతున్నారు. రెండు శాఖల అధికారులు మరోమారు సర్వే చేసి మాకు అన్యాయం జరగకుండా చూడాలి.

–బుడిగే సదానందం, స్టేషన్‌బస్తీ వాసి, ఇల్లెందు పట్టణం

అందరికీ న్యాయం జరగాలి..



స్టేషన్‌బస్తీలో నివాసం ఉంటున్న 19, 20, 21 వార్డుల ప్రజలకు న్యాయం జరగాలి. కలెక్టర్, ఎమ్మెల్యే చొరవ తీసుకుని మూడు శాఖల అధికారులతో సంయుక్త సమావేశం నిర్వహించాలి. తద్వారా ప్రజలు నష్టపోకుండా క్రమబద్ధీకరణ చేయాలి.

–బానోతు రవినాయక్, మాజీ కౌన్సిలర్, ఇల్లెందు పట్టణం

ఈనెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ



సింగరేణి అప్పగించిన సర్వే నెంబర్ 537 పరిధిలో ఉన్న వారు క్రమబద్ధీకరణకు ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇక సర్వే నెంబర్ 538లోని ఇళ్ల వరకు ఉన్న భూమిని అప్పగించాలని సింగరేణి అధికారులను కోరుతున్నాం. –మొగిలి లక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్

సీపీఐ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ ముట్టడి



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

పాల్వంచ: మున్సిపాలిటీలో అన్ని వార్డులకు కనీసం తాగునీరు సరఫరా చేయడంలో మున్సిపల్ యంత్రాంగం, పాలకులు విఫలం చెందారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం చంద్ర రాజేశ్వరరావు భవన్ నుంచి ప్రదర్శనగా మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకున్నారు. మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా మున్సిపాలిటీకి పాలకవర్గం లేకపోవడంతో సమస్యలకు నిలయంగా మారిందన్నారు. తక్షణమే మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించి పాలకవర్గం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణానికి నీటి వనరులు పుష్కలంగా ఉన్నప్పటికీ అన్ని ఏరియాలకు తాగునీరు అందించలేని దుస్థితి నెలకొందన్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల పనులు సగం వేసి వదిలేసినట్లు చెప్పారు. తాగునీరు, అంతర్గత రోడ్లు, డ్రెయినేజీలు, ఇంటి నంబర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం డీఈ మురళీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు.

ఐఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అస్లాం



పాల్వంచ: సీపీఐ అనుబంధ తన్జీమ్ ఎ ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పాల్వంచకు చెందిన మహ్మద్ అస్లాం నియామకమయ్యారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో జరిగిన మహాసభల్లో అస్లాంను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం అస్లాం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

హెచ్‌ఎంలకు ట్యాబ్‌లు అందజేత

టేకులపల్లి: పాఠశాలల్లోని అన్ని రకాల వివరాలు డిజిటల్ విధానంలో అందజేసేందుకు ప్రభుత్వం అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేస్తోంది. ఇందులో భాగంగా బుధవారం టేకులపల్లి విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని మొత్తం 67 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఆయా హెచ్‌ఎంలకు ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్ ట్యాబ్‌లు అందజేశారు.

అర్హులందరినీ ఓటరుగా నమోదు చేయించాలి

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ కృష్ణవేణి సూచించారు. తహసీల్‌లో బీఎల్‌ఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే నిర్వహించిన సమయంలో కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలని చెప్పారు.

పదోన్నతులు నిలిపివేయండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సూపర్ బజార్లలో అక్రమాలకు పాల్పడిన అధికారులను వదిలేసి సిబ్బందిపై చర్యలు తీసుకున్న యజమాన్యం.. ఇప్పుడు వారికి పదోన్నతులు ఇవ్వడం సరికాదని ఏఐటీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వంగా వెంకట్ పేర్కొన్నారు. కొత్తగూడెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సూపర్‌బజార్లలో యజమాన్యం పెట్టుబడి లేకున్నా అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడినందున పదోన్నతి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

పాల్వంచ: లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా పాస్ట్ గవర్నర్ ఎ.కోటేశ్వరరావు అన్నారు. బుధవారం పాల్వంచలో జిల్లా కేబినేట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధి ఆరుద్ర సత్యనారాయణను సన్మానించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ పేరుతో నూతన క్లబ్‌ను స్థాపించి అనేక సంఘ సేవా కార్యాక్రమాల్లో సత్యనారాయణ కృషి చేసినట్లు చెప్పారు. క్లబ్ ప్రతినిధులు ఎడవల్లి కృష్ణ, చాట్ల శ్రీనివాసరావు, పాకాలపాటి రోశయ్య చౌదరి, పుట్టా నాగేశ్వరరావు, కత్తి శ్రీనివాస్, చేపూరి బ్రహ్మాచారి, రాజమనోహర్, సతీశ్, కాటా నవీన్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న నవీన్ రాథోడ్

జూలూరుపాడు: భోజ్యాతండా బీటీ రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ నవీన్ రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిలిచిపోయిన రోడ్డు పనులను బుధవారం స్థానికులతో కలిసి పరిశీలించారు. మాట్లాడుతూ.. ఐదేళ్ల క్రితం పాపకొల్లు – భోజ్యాతండా వరకు బీటీ రోడ్డుకు ఐటీడీఏ నుంచి రూ.3 కోట్లు మంజూరయ్యాయన్నారు. మూడు కిలోమీటర్ల మేర మెటల్ తోలి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఇదే మార్గంలో సీతారామ ప్రాజెక్టు కెనాల్ నిర్మాణ పనుల కోసం వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో రోడ్డుపై కంకర తేలడంతో తండా ప్రజలు అవస్థలు పడుతున్నట్లు చెప్పారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు ధరంసోత్ స్వామి నాయక్, మాళోత్ సక్కా నాయక్, ధరావత్ లచ్చిరామ్, మాళోత్ సురేష్, లాలు నాయక్, శ్రీహరి, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

చుంచుపల్లి: మహా జనసంపర్క్‌లో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలోని 23వ వార్డులో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో స్థానికుడైన తనను గెలిపిస్తే సమస్యల పరిష్కరిస్తానని చెప్పారు.

క్రీడాపాఠశాలలో ప్రవేశాలు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాలలో 2023–2024 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి జూలై1వ తేదీన విద్యార్థుల ఎంపికకు బ్యాటరీ టెస్టులు నిర్వహించడం జరుగుతుందని హెచ్‌ఎం.చంద్ బుధవారం ఒక పకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఆసక్తి కలిగిన ఐదో తరగతి చదివిన విద్యార్థులు 6నుంచి 9వ తరగతి వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఆర్థిక సాయం

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన బలుగూరి రోశారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతని స్నేహితులు బుధవారం రూ.35,500 అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

వేతనాలు అందని కార్మికులు

ఇల్లెందు: మున్సిపల్ కార్మికులకు వేతనాలు అందక అల్లాడుతున్నారు. రెగ్యులర్‌గా వేతనాలు విడుదల కావటం లేదని, కుటుంబాలు గడవటం కష్టంగా ఉందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకుబ్‌షావలీ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఇల్లెందులోని ఫిల్టర్ బెడ్‌లో మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సదా, మహేష్, రాజు, ముకుందం, నందు, ప్రకాష్ ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయండి

పాల్వంచరూరల్: వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల రాంబాబు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 70లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని ఈ కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు.

బడిబాటలో 'బొల్లేరుగూడెం' ముందంజ



రాజమొగిలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ: 2023–24 విద్యా సంవత్సరం బడిబాట కార్యాక్రమంలో పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ పాఠశాల ముందంజలో నిలిచింది. సుమారు 350 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా చేరారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం రాజమొగిలిని ఎస్‌ఎంసీ చైర్మన్ గండికోట దేవేందర్, ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు డీఈఓ సోమశేఖరశర్మ సహకారంతో బడిబాటను విజయవంతం చేశామని, ఇందుకు ఎస్‌ఎంసీ కమిటీ, ఉపాధ్యాయులు సహకారం ఎంతో ఉందన్నారు. విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించడం జరుగుతుందన్నారు.

మున్సిపల్ కమిషనర్ సందర్శన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న రఘు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలో అంతర్భాగమైన రామవరం 10వ వార్డును బుధవారం మున్సిపల్ కమిషనర్ రఘు ఆకస్మికంగా సందర్శించారు. వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వర్షం వస్తే నీరు నిల్వ ఉంటోందని, దోమలకు నిలయంగా మారాయన్నారు. ఫలితంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వార్డుల్లో బ్లీచింగ్, ఫాగింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీపీఓ ప్రభాకర్, ఏఈ రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి, జవాన్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై దృష్టి పెట్టండి

ఇల్లెందు: మున్సిపాల్టీలోని 24 వార్డుల్లో చెత్త సేకరణ మీద దృష్టి సారించాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆదేశించారు. బుధవారం కార్యాలయం ఆవరణలో శానిటేషన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సీజన్ దృష్ట్యా తడి, పొడి చెత్తను తక్షణమే తొలగించాలని ప్రతీ వార్డు పరిశుభ్రంగా ఉండేట్లు చూడాలన్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా చెత్తను ఎత్తివేయాలని, డంప్ యార్డును శుభ్రంగా ఉంచాలని సూచించారు. అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని శానిటేషన్ విభాగం పనితీరు మీద పట్టణం ఆధారపడి ఉందన్నారు. వారానికి ఒకసారి వార్డుల్లో దోమల మందు పిచికారీ చేయాలన్నారు. కమిషనర్ అంకుషావలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, జవాన్లు పాల్గొన్నారు.

విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



కొత్తగూడెంఅర్బన్: నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు పాఠశాలల విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నాయని వాటిని అరికట్టాలి బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌రావు, కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కోలా మల్లిక, కేతిని కుమారి, మర్థమ్మ, ఎర్రంశెట్టి రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇల్లెందు: విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో ప్రైవేట్ విద్యాసంస్థలు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ కోసం దోపిడీ తీవ్రతరం చేశారని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, బయ్యా అభిమన్యులు వేర్వేరుగా జరిగిన కమిటీ సమావేశాలలో మాట్లాడుతూ.. పట్టణంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్థసారథి, గణేష్, తరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో స్వచ్ఛ పక్వాడా



మొక్క నాటుతున్న డైరెక్టర్లు, జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ కంపెనీ వ్యాప్తంగా ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఇల్లెందు గెస్ట్ హౌజ్ ఆవరణలో కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ, ఫారెస్ట్ విభాగాల ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావు హాజరై మొక్కలు నాటారు. మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం దేశమంతటా విజయవంతం అవుతోందని దీనిలో భాగంగా సింగరేణిలో కూడా విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో జీఎం హెచ్‌ఆర్‌డీ వెంకటేశ్వరరావు, జీఎం సీపీపీ జక్కం రమేష్, జీఎం వెల్ఫేర్ బసవయ్య, డీజీఎంలు రఘుకుమార్, కే.శ్రీనివాస్, డీవైఎస్‌ఈ సివిల్ రవికుమార్, డీవైపీఎంలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అందరికీ పోడు పట్టాలు ఇవ్వాలి



టేకులపల్లి: ముత్యాలంపాడులో నిరసన తెలియజేస్తున్న నాయకులు

టేకులపల్లి: సాగులో ఉన్న పోడు భూములన్నింటికీ పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం ముత్యాలంపాడులో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పార్టీ టేకులపల్లి సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు.. కుర్చీ వేసుకొని పోడు భూములకు పట్టాలు ఇచ్చేవరకు ఇక్కడి నుంచి కదలని చెప్పిన సీఎం కేసీఆర్ ఎన్నికల అయిపోగానే ఆ హామీని మరిచారని విమర్శించారు. పట్టాలివ్వకపోగా సాగు చేసుకుంటున్న భూమిని హరితహారం పేరుతో లాక్కోవడం సిగ్గుచేటన్నారు. పొట్టకూటి కోసం పోడు కొట్టుకున్న రైతులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. 13.50 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే గిరిజనులు, గిరిజనేతరులు, ఉద్యోగస్తులు, వృద్ధులు అని సాకులు చెబుతూ 70 వేల మందికి మాత్రమే ఇస్తానని చెప్పడంలో అంతర్యం ఏమిటన్నారు. నాటి ఎన్నికల నుంచి ఇప్పటి వరకు పట్టాలు ఇవ్వని కేసీఆర్ ఈనెల 30 నుంచి పట్టాలు ఇస్తామని చెప్పడం ఎన్నికల ఎత్తుగడలో భాగమేనన్నారు.

జూలూరుపాడు: సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కొత్తగూడె డివిజన్ కార్యదర్శి ఎస్కె ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన ఆ పార్టీ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వల్లోజి రమేష్, గలిగె వెంకటేశ్వర్లు, నరసింహారావు పాల్గొన్నారు.

ఉపా కేసు ఉపసంహరించుకోవాలి

ఇల్లెందురూరల్: పీఓడబ్ల్యూ నేత సంధ్యతోపాటు మరో 146 మందిపై పాలకులు పెట్టిన ఉపా కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ప్రచురించిన ప్రచార పోస్టర్లను సంఘం నాయకులు బుధవారం బొజ్జాయిగూడెం గ్రామంలో ఆవిష్కరించారు. పీవైఎల్ మండల కార్యదర్శి రావూరి ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రజా హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు నిర్మిస్తున్న నేతలపై ఇటువంటి కేసులు బనాయించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో చీమల రుక్మిణి, దేవి, శ్రీదేవి, కల్తి లక్ష్మి, భద్రమ్మ, సుచిత్ర, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడు మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎంఈఓ కార్యాలయం వరకు భారీ ప్రదర్శన నిర్వహించి ధర్నాకు దిగారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉంటే విద్యార్థుల ఆకలి తీర్చేది ఎవరని ప్రశ్నించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో బోడా అభిమిత్ర, జెమ్మి యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు..

టేకులపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్‌నబీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికుల సమస్యలు, దశల వారీ ఆందోళనల వివరాలు తెలియజేస్తూ బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి టేకులపల్లి ఎంఈవో ఠాకూర్ రాంసింగ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పెంచిన వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు, బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. జూలై 4న జిల్లాలో టోకెన్ సమ్మె, 5న ఎంఈఓ కార్యాలయాల ఎదుట ధర్నా, 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల ఆందోళనతో సమస్య పరిష్కారం కాకపోతే జూలై 10 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు ప్రకటించారు.